## 4-84

### మున్నుడి

శ్రీమన్నారాయణుని దశావతారములను కీర్తించాలంటే అన్నమాచార్యులవారే ప్రథమ స్థానంలో వుంటారు. నూటికి తొంబది మందికి ఇది దశావతార కీర్తన అని అర్థం అవదు. అథవా... స్ఫురించినా అన్వయించటం అంత సుసాధ్యం కాదు. జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు దీని భావామృతం చదివితే అన్నమయ్య పాండిత్యం, అనంతం... అసామాన్యం అని అర్థం అవుతుంది. ఆయనని పొగడటం అటుంచి మన భాషతెలుగు అయినందుకు గర్వంతో మన తలపైకి లేస్తుంది. నిజం...

**ఆ.వె॥ పురుషులకు పురుషుడ! పురుషోత్తమా నీకు**

**పురుడు లేదు, శ్రేష్ఠపురుషుడీవు**

**హరిదశావతార తీరునెరుగలేము**

**తరచి తరచి చూడ ఎరుకయగును.**

**రాగం : హిందోళము**

పురుషులకు పురుషుడవు పురుషోత్తమా
పురుడు లేదికి నీకు బురుషోత్తమా ॥పురుష॥

పొలసులాడకు నీవు పురుషోత్తమా
బలిసి లోగగనేల పురుషోత్తమా
పొలము రాజవు నీవు పురుషోత్తమా
పొలకువదే కంబమున పురుషోత్తమా ॥పురుష॥

పొడవులకు బొడవైన పురుషోత్తమా
పుడిసిళ్ళ జల్లితివి పురుషోత్తమా
పుడికి సతిగైకొంటి పురుషోత్తమా
పొడమె చీకటి తప్పు పురుషోత్తమా ॥పురుష॥





బూటకపు బుద్ధిగల పురుషోత్తమా
పోటిగుజ్జపు బసల పురుషోత్తమా
మేటి శ్రీవేంకటము మీద పురుషోత్తమా
పూటపూటవరాలు పురుషోత్తమా ॥పురుష॥

### భావామృతం

పురుషులందరికీ (అంటే జన్మనెత్తిన జీవులందరిలోకి) పురుషుడవు (అధికుడవైన) పురుషోత్తమా (పరమాత్మవైన నారాయణుడా) పురుడులేదిక నీకు (అసలు నీకు జననమే లేదు ప్రభూ!)

ఓ పురుషోత్తమా! నీవు పొలసులాడకు. (చేపలకంపు కొట్టవద్దు...అంటే మత్స్యావతారము). బలిసి లోగగనేల పురుషోత్తమా! (అధికుడవై కూడ లొంగి ఒకరి క్రింద పడివుండుట యెందుకు పురుషోత్తమా!...అంటే కూర్మావతారం).

పొలము రాజవు నీవు (అడవికి మొనగాడైన అడవి పందివి (వరాహావతారం) పొలకువదే కంబమున (స్తంభమునందు, అదిగో నీ జాడ కనబడినది...అంటే అప్పటికప్పుడు స్తంభము నుండి ఆవిర్భవించినవాడు...అంటే నరసింహావతారం).

పొడవులకు పొడవైన (ఉన్నతులైనవారందరిలో ఉత్కృష్టుడవైన... త్రివిక్రముడు. అనగా వామనావతారము) పురుషోత్తముడు. పుడిసిళ్ళ జల్లితివి (పుడికిళ్ళతో...దీనినే నేటికాలంలో "పిడికెళ్ళతో" అంటున్నాం.. అంటే పిడికెళ్ళతో రాజుల రక్తం వెదజల్లిన పురుషోత్తముడు..అంటే పరశురాముడు). పుడికి సతిగైకొంటివి (బుజ్జగించి భార్యను స్వీకరించిన పురుషోత్తముడు.. శ్రీరామావతారం). పొడమె చీకటితప్పు పురుషోత్తమా (జారత్వము పొడగాగల దేవా!..జారుడు అనిపించుకొని మచ్చ తెచ్చుకొన్న శ్రీకృష్ణా!)

బూటకపు బుద్ధిగల (మౌనముతో మానం అపహరించు బుద్ధిగల పురుషోత్తమా...బుద్ధావతారము). పోటి గుజ్జపు బసల పురుషోత్తమా (గొప్ప చాతుర్యంగల యుద్ధాశ్వమునెక్కిన కల్కిఅవతారం). మేటి పురుషోత్తముడైన శ్రీవేంకటేశ్వరా! తిరుమల మీద ఏ పూటవరాలు ఆపూటనే ఇచ్చివేసే పురుషోత్తమా! శ్రీనివాసా! ధన్యోస్మి ప్రభూ!

**2-89**

## మున్నుడి

చిన్నతిరుమలాచార్యులవారు మన కందించిన అనేక ఆణిముత్యాలలాంటి భజనలలో ఇదికూడా ఒకటి. సాధారణ మానవుడు, జ్ఞానం పెద్దగా లేనివాడు కూడా హరికి 'దగ్గరయ్యే' అత్యుత్తమ మార్గం భజనయే. హరికథాశ్రవణంలో మధ్య మధ్య 'పరధ్యానం' కలుగవచ్చును గాని భజనలో ఆ ప్రమాదం లేదు. ఈ కీర్తనలో అన్నీ తేలిక పదాలే కాబట్టి భావామృతం పెద్దగా అవసరం లేదు అనుకోకండి. వివరణ కావలసిన పదాలు ఇందులోను ఒకటి రెండు లేకపోలేదు. 'సోవల' అంటే... ఏమిటి? 'సోవ' అంటే జాడ. 'సోవ'ల అనే పదం నాకు దొరకలేదు. సోవల అంటే సోవల రూపాంతరంగా అని 'భావించాను'.

కం॥ కొలువరె గోవిందా యని
పలుకుమ హరి నామములను పాయక ఎపుడున్
తొలగును పాపపురాసులు
తెలిపెను చిన తిరుమలయ్య తిరుమల రాయా!

రాగం : బృందావని

గోవింద గోవిందయని కొలువరే
గోవిందాయని కొలువరే ॥గోవింద॥

హరియచ్యుతాయని యూడరే
పురుషోత్తమాయని పొగడరె
పరమ పురుషయని పలుకరే
సిరివరయనుచును చెలగరె జనులు ॥గోవింద॥

పాండవ వరదాయని పాడరే
అండజ వాహను కొనియాడరె
కొండలరాయనినె కోరరె
దండితో మాధవునినె తలచరె జనులు ॥గోవింద॥





దేవుడు శ్రీ విభుడని తెలియరె
సోవల ననంతుని చూడరె
శ్రీవేంకటనాథుని చేరరే
పావనమై యెప్పుడును బ్రదుకరె జనులు ॥గోవింద॥

భావామృతం :

ఓ జనులారా! మనస్ఫూర్తిగా మీరంతా 'గోవింద.. గోవింద' అని శ్రీమన్నారాయణునికి మ్రొక్కండి. పూజించండి. గోవిందుని స్మరించండి.

ఓ భక్తులారా! పరవశించి మీరంతా హరీ.. అచ్యుతా... అంటూ నాట్యం చేయండి. పురుషోత్తమా... అంటూ ఆ మహానుభావుని పొగడండి. పరమపురుషా! అని పిలవండి. ఆ నామం పలకండి. సిరివరుడు అంటే లక్ష్మీకాంతా! అని విజృంభించి ఆ నారాయణుని భజించండి.

ఓ ప్రజలారా! శ్రీకృష్ణావతారుడై ధర్మస్థాపకుడైన ఆ స్వామిని పాండవ వరదుడని పాడుచూ కీర్తించండి. అండము(గ్రుడ్డు) నుండి పుట్టిన గరుత్మంతుడు వాహనముగా గల విష్ణుమూర్తిని కొనియాడండి. ఏడుకొండల రాయుడని ప్రసిద్ధికెందిన ఈ స్వామిని మీకు కావలసిన వర్షాలు కోరుకోండి. ధైర్యంగా ఆ మాధవుడే (లక్ష్మీకాంతుడు) దిక్కని తలచండి సందేహించకండి.

మానవులారా! ఈ శ్రీ వేంకటేశ్వరుడే శ్రీపతి. ఈయనే దైవం అని తెలియండి. అనంతుడని, వినుతి కెక్కిన ఆ ప్రభువు జాడ గ్రహించి ఆయనను దర్శించండి. ఆ విధంగా మీరు శ్రీవేంకటనాథుని చేరండి. ఆ విధంగా పుణ్యాత్ములై ఎప్పుడూ ఆ శ్రీవేంకటరమణునే ధ్యానిస్తూ బ్రతుకును వెళ్లబుచ్చండి.